అంగరంగ వైభవంగా వెంకన్న కల్యాణం



వేంకటేశ్వరస్వామి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపిస్తున్న అర్చకులు



బెండమూర్లంకలో ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు



విద్యుత్ దీపాల వెలుగుల్లో వేంకటేశుని దేవస్థానం గాలి గోపురం

- అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్త జనం
- శాస్త్రోక్తంగా కల్యాణ క్రతువు జరిపిన అర్చకులు

అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణం గురువారం ఉదయం 11.04 గంటలకు అత్యంత వైభవోపేతంగా జరిగింది. కోనసీమ నలు మూలల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారి కల్యాణాన్ని ఆద్యంతం తిలకించి తరించారు. దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్, అంతర్వేది శ్రీలక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం ఈఓ వి.సత్యనారాయణ ఉత్సవ అధికారిగా కల్యాణ వేడుకలకు హాజరై ప్రభుత్వం తరఫున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. కల్యాణానికి స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో నూతనంగా నిర్మించిన కల్యాణ వేదిక వద్దకు తోడ్కొని వచ్చారు. పట్టణానికి చెందిన అబ్బిరెడ్డి సురేష్, సుధారాణి దంపతులు కల్యాణకర్తలుగా పీటలపై కూర్చుని కల్యాణ క్రతువును జరిపించారు. బ్రహ్మశ్రీ సుదర్శన మురళీకృష్ణాచార్యులు, పెద్దింటి సత్యనారాయణాచార్యులు, పెద్దింటి వీబీఎల్ఎస్ ఆచార్యుల ఆధ్వర్యంలో అర్చకుల బృందం కల్యాణ క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. మాంగల్యధారణ సమయంలో ఆలయ ప్రాంగణమంతా గోవింద నామస్మరణతో మారుమోగింది. దేవస్థాన ప్రాంగణానికి భక్తులు భారీగా తరలి రావడంతో చాలా మంది దేవస్థానం ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరలపై కల్యాణ తంతును తిలకించారు.

ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాల సమర్పణ

ఆలయ చైర్‌పర్సన్ దూడల వెంకట విరీతాదేవి, ఆలయ ఈఓ దూనబోయిన సాయిబాబు, ధర్మకర్తల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణ ఏర్పాట్లు జరిగాయి. జిల్లా దేవాదాయశాఖ అధికారి డి.నాగ మల్లేశ్వరరావు, వివిధ దేవస్థానాల ఈఓలు మాచిరాజు లక్ష్మీనారాయణ, బొక్కా వీర వెంకటేశ్వరరావు, కోనేరు కార్తీక తదితరులు స్వామి కల్యాణాన్ని పర్యవేక్షించారు. కల్యాణాన్ని తిలకించేందుకు తరలివచ్చిన వేలాది మంది భక్తులకు దేవస్థానం తరపున ఉచిత ప్రసాద వితరణ, అన్న సమారాధన నిర్వహించారు. ఆలయ చైర్‌పర్సన్ విరీతాదేవి, వైఎస్సార్ సీపీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు దూడల ఫణి దంపతులు స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. రాష్ట్ర మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి బేబీ మీనాక్షి, పలువురు మున్సిపల్ కౌన్సిలర్లు స్వామి వారి కల్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. స్వామి వారి కల్యాణానికి పలువురు భక్తులు ముత్యాల తలంబ్రాలు సమకూర్చారు. మున్సిపల్ మాజీ కౌన్సిలర్ మామిడిపల్లి రాంబాబు స్వామి వారికి 500 గ్రాముల ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించారు.

కల్యాణం.. కమనీయం

అల్లవరం: మండలంలోని బెండమూర్లంకలో బంగారు తిరుపతిగా ప్రసిద్ధి చెందిన శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీదేవి, భూదేవి, సమేత వేంకటేశ్వర స్వామి వారి కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. కల్యాణ వేదికపై పెండ్లి కుమారుడిగా వేంకటేశ్వర స్వామిని, పెండ్లి కుమార్తెలుగా శ్రీదేవి, భూదేవిలను అలంకరించి వేద పండితుల ఆధ్వర్యంలో గుర్రం సత్యనారాయణ, మంగతాయారు దంపతులచే కల్యాణం జరిపించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు వచ్చేసి స్వామివారి కల్యాణాన్ని తిలకించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు యాళ్ల దొరబాబు స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాల సందర్భంగా అమలాపురం వేంకటేశ్వర స్వామి దేవస్థానం ప్రాంగణం మిరమిట్లు గొలిపే విద్యుత్ దీపాల అలంకరణతో దేదీప్యమానంగా వెలుగులీనుతోంది. దేవస్థానంలోని అంతరాలయం, ముఖ మండపంతో పాటు దేవస్థానం ప్రాంగణం, గోలి గోపురం, బేడా మండపం గురువారం రాత్రి కాంతిమయంగా కనిపించింది.



స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ



వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని తిలకిస్తున్న భక్త జనం

క్లుప్తంగా

ఆలయాల్లో ఎమ్మెల్యే పొన్నాడ పూజలు



తలుపులమ్మ ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ కుటుంబ సభ్యులు

తాళ్లరేవు: సార్వత్రిక ఎన్నికల్లో ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం పలు ఆలయాలను సందర్శించి పూజలు చేశారు. పొన్నాడ శుక్రవారం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఈ నేపథ్యంలో పటవల తలుపులమ్మ ఆలయంలో సతీమణి, కుమారుడితో కలిసి పూజలు నిర్వహించారు. అదేవిధంగా మట్లపాలెం మహాలక్ష్మి ఆలయం, చొల్లంగి ఆంజనేయస్వామివారి ఆలయం, తాళ్లరేవు జిల్లావారిపేటలోని రామాలయం తదితర ఆలయాలను సందర్శించారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వద్ద అగ్నిమాపక యంత్రాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శిస్తున్న సిబ్బంది

అమలాపురం టౌన్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని ఆస్పత్రుల వద్ద ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపకశాఖ అధికారులు అవగాహన కల్పించారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి ఆవరణలో అమలాపురం అగ్నిమాపక దళాధికారి కేవీ మురళీ కొండబాబు, లీడింగ్ ఫైర్‌మెన్ మట్టపర్తి బలరామ్ అగ్నిమాపక యంత్రాలను ప్రయోగాత్మకంగా ప్రదర్శించి చైతన్యపరిచారు. పట్టణంలోని వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవాల వద్దకు వెళ్లి దేవస్థానం ఎదుట ప్రజలకు అగ్ని ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు.

రఘురామకృష్ణంరాజువి కుటిల రాజకీయాలు

అమలాపురం టౌన్: పేద క్షత్రియ కుటుంబాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విలువ రఘురామ కృష్ణంరాజుకి ఏం తెలుసని, ఆయనవి కుటిల రాజకీయాలని వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఇందుకూరి నరసింహరాజు అన్నారు. ఈ మేరకు నరసింహరాజు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అప్పులు తీసుకుని బ్యాంకులను నిలువునా మోసం చేసిన చరిత్ర ఉన్న నువ్వా పేదల పెన్నిధి అయిన జగన్‌ను విమర్శించేది అని ప్రశ్నించారు. రఘురామకృష్ణంరాజు దారి, తెన్నూ లేని రాజకీయంతో క్షత్రియుల పరువు తీస్తున్నారన్నారు. ఇప్పటికైనా జగన్‌కు క్షమాపణలు చెప్పి ఆయన తన పాపాలను కడుక్కోవాలని, లేదంటే రాజకీయంగా పుట్టగతులు ఉండవన్నారు.

వైభవంగా సీతారామ పట్టాభిషేకం



సీతారాములకు పట్టాభిషేకాన్ని నిర్వహిస్తున్న పీఠాధిపతి కామేశ మహర్షి

అమలాపురం టౌన్: స్థానిక శ్రీకామాక్షీ పీఠం మహా ప్రస్థానంలో సీతారామ మహాసామ్రాజ్య పట్టాభిషేకం గురువారం అత్యంత వైభవంగా జరిగింది. సప్త నదీ జలాలతో సీతారాముల విగ్రహాలను అభిషేకించారు. ఆగమ విద్వాన్ పూజ్యం నాగేశ్వరశర్మ యాజ్ఞీకంలో రాజమహేంద్రవరానికి చెందిన కోళ్లపర్తి శివ రామారావు, సత్యశ్రీ దంపతులు కర్తలుగా సీతారామ పట్టాభిషేకాన్ని నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం అన్నసమారాధన చేశారు. పీఠంలో తొలిసారిగా శ్రీరామనవమి మర్నాడు మహా సామ్రాజ్య పట్టాభిషేకాన్ని నిర్వహించే సంప్రదాయానికి గురువారం నుంచి శ్రీకారం చుట్టినట్టు పీఠాధిపతి కామేశ మహర్షి అన్నారు.

తొలి రోజు నామినేషన్లు నిల్

ముమ్మిడివరం: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎ.మదన్‌మోహన్‌రావు నామినేషన్ ప్రక్రియను ప్రారంభించారు. అయితే మొదటి రోజు గురువారం ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాలేదు.

అందరికీ ఉపాధి పనులు కల్పించాలి

తాళ్లరేవు: అడిగినవారందరికీ ఉపాధి పనులు చూపించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, దుప్పి అదృష్టదీపుడు, ఎం.తణుకురాజు, ఎస్ త్రిమూర్తులు, వెంకటలక్ష్మి తదితరులు గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఎక్కువ పనిదినాలు కల్పించడంతో పాటు పని చేసే చోట కనీస సౌకర్యాలు కల్పించాలన్నారు.

డీవైఈవోగా సూర్యప్రకాశం



డీవైఈవో సూర్యప్రకాశాన్ని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రతినిధులు

అమలాపురం రూరల్: అమలాపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారిగా(డీవైఈవో) గుబ్బల సూర్యప్రకాశం నియమితులయ్యారు. ఇప్పటివరకూ అమలాపురం మండల విద్యాశాఖాధికారి–1గా పనిచేస్తున్న సూర్యప్రకాశంకు డీవైఈవోగా పదోన్నతి లభించింది. ఈ మేరకు పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ కె.నాగమణి ఉత్తర్వులు జారీ చేశారు. పదోన్నతి పొందిన సూర్యప్రకాశాన్ని డీఈవో ఎం.కమలకుమారి అభినందించారు. ఆయనను జిల్లా, డివిజన్ ప్రధానోపాధ్యాయుల సంఘాల ప్రతినిధులు, పలువురు ఉపాధ్యాయులు అమలాపురంలోని డీవైఈవో కార్యాలయంలో గురువారం సాయంత్రం కలిసి సత్కరించారు. అభినందించిన వారిలో జిల్లా గెజిటెడ్ హెడ్ మాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోకా ప్రకాష్, ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాస్, డివిజన్ సంఘం అధ్యక్షుడు నిమ్మకాయల గణేశ్వరరావు, కార్యదర్శి పెచ్చెట్టి శ్రీనివాస్ తదితరులున్నారు.

నేడు పొన్నాడ నామినేషన్



పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

ముమ్మిడివరం: ముమ్మిడివరం అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ శుక్రవారం ఉదయం తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఉదయం 9.09 గంటలకు అమలాపురంలోని ఆయన స్వగృహం నుంచి బయలుదేరి ముమ్మిడివరం కొండాలమ్మ చింత వద్దకు చేరుకుంటారు. కొండాలమ్మ అమ్మవారిని దర్శించుకుని అక్కడ నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో పాదయాత్రగా బయలుదేరి తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుంటారు. ఉదయం 11.14 గంటలకు తన నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి సమర్పించనున్నారు. కార్యక్రమానికి ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల పరిధిలోని నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని వైఎస్సార్ సీపీ కార్యాలయ వర్గాలు పిలుపునిచ్చాయి.

సంక్షేమ రథ సారథిని గెలిపించుకుందాం



ఉప్పలగుప్తం ఎన్నికల ప్రచారంలో మంత్రి విశ్వరూప్‌కు హారతి ఇస్తున్న స్థానిక మహిళ



ఓటర్లకు అభివాదం చేస్తూ ప్రచారం కొనసాగిస్తున్న మంత్రి విశ్వరూప్

- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్
- ఉప్పలగుప్తంలో ఎన్నికల ప్రచారం

ఉప్పలగుప్తం: ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్న సంక్షేమ రథ సారథిని రానున్న ఎన్నికల్లో గెలిపించుకుందామని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. మండలంలోని స్థానిక గ్రామంలో గురువారం విశ్వరూప్ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పర్యటిస్తున్న ఆయనకు మహిళలు అడుగడుగునా హారతులు పట్టారు. అభిమానులు పూలమాలలు వేస్తూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి విశ్వరూప్ మాట్లాడుతూ కూటమిగా వస్తున్న చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కరోనా సమయంలో పక్క రాష్ట్రాల్లోని ఫామ్ హౌస్‌ల్లో దాక్కున్నారన్నారు. అప్పుడు ప్రజలందరికీ సకాలంలో వైద్యం అందేలా పరిపాలన సాగించింది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. చంద్రబాబు 2014 నుంచి 2019 వరకూ ఇచ్చిన హామీలను ఎంతవరకూ నెరవేర్చారో ప్రజలు గ్రహించుకోవాలన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం వైఎస్సార్ ఆసరా పథకంతో రుణమాఫీ చేసింది జగనన్న మాత్రమే అని మహిళలకు గుర్తుచేశారు. మళ్లీ అదే సంక్షేమాభివృద్ధి జరగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటేసి జగనన్నను సీఎం చేయాలని ఓటర్లను కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు గెడ్డం సంపదరావు, సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు, మండల పార్టీ అధ్యక్షుడు బద్రి బాబ్జి, ఎంపీటీసీ సభ్యురాలు చిక్కం త్రినాథ, ఉప సర్పంచ్ మోకా శ్రీనివాసరావు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ చీకట్ల కిషోర్, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ మోటూరి సాయి, బీసీ, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు యనమదల పల్లంరాజు, పోతుమూడి కొండబాబు, జేసీఎస్ మండల కన్వీనర్ కోటుం లోవరాజు, రైతు విభాగం మండల అధ్యక్షుడు చిక్కం బాలయ్య, గ్రామ కమిటీ అధ్యక్షుడు అడబాల మాధవ, సేవాదళ్ జిల్లా కార్యదర్శి పెయ్యిల రమణ, మోటూరి సత్యంకాపు, దాట్ల రాజేష్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అయోధ్య రామాలయ నమూనా తయారీ



అట్టపెట్టెలతో అయోధ్య రామాలయ నమూనా తయారుచేసిన చిన్నారులు

తాళ్లరేవు: మండల కేంద్రమైన తాళ్లరేవు గ్రామానికి చెందిన అన్నాచెల్లెళ్లు సీరం అభిరామ్‌సాయి, కీర్తి లక్ష్మీప్రసన్న అయోధ్య రామాలయం నమూనాను అట్టపెట్టలతో, రంగురంగుల కాగితాలతో తయారు చేశారు. చిన్నారులు తయారుచేసిన రామాలయం నమూనా స్థానికులను ఆకట్టుకుంది. వారి సూచన మేరకు పగడాలపేటలోని రామాలయానికి ఆలయ నమూనాను బహూకరించారు.

కార్మికులు ఓటు హక్కు వినియోగించుకోవాలి

అమలాపురం రూరల్: పుదుచ్చేరిలో ఓటు హక్కు కలిగి కోనసీమ జిల్లాలో పబ్లిక్ ప్రైవేట్ సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న కార్మికులంతా శుక్రవారం యానాంలో జరగనున్న ఎన్నికల్లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా సహాయ లేబర్ కమిషనర్ టి.నాగలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, షాపులు, హోటల్స్‌లో కార్మికులుగా పని చేస్తున్న వారికి తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి గాను జీతంతో కూడిన సెలవు ఇవ్వాలని ఆయా యజమాన్యాలకు ఆమె సూచించారు. జీతభత్యాలు ఇవ్వని సంస్థలపై కార్మిక చట్టాలను అనుసరించి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సహిత విద్యపై అవగాహన అవసరం



సదస్సులో మాట్లాడుతున్న జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి

ముమ్మిడివరం: సహిత విద్యపై అవగాహన పెంపొందించుకుంటే ప్రత్యేక అవసరాల పిల్లలకు మరింతగా సేవలు అందించవచ్చని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి సూచించారు. సమగ్ర శిక్ష అదనపు సంచాలకులు ఎ.మధుసూదనరావు ఆధ్వర్యంలో స్థానిక ఎయిమ్స్ కాలేజి కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం సీడీపీఓ, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ప్రత్యేక అవసరాల పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు సహిత విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి ఎం.కమలకుమారి మాట్లాడుతూ పిల్లలకు సేవ చేయగలగడం మంచి అవకాశంగా భావించాలన్నారు. సమగ్ర శిక్ష ఐఈ విభాగం ద్వారా అందించే సేవలకు సంబంధించిన పలు అంశాలను అదనపు సంచాలకులు ఎ.మధుసూదనరావు వివరించారు. కార్యక్రమంలో జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ, సీఎంఓ బి.సుబ్రమణ్యం, ఏఎంఓ పి.రాంబాబు, ఎప్ఏఓ జి.ప్రవీణ్, ఏపీఓ ఎం.భీమారావు, ఎస్.పెద్దిరాజు, జి.శివరాజు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ శాతం పెరిగేనా?

విస్తృత ప్రచారం నిర్వహించిన అధికారులు

యానాం: పుదుచ్చేరి పార్లమెంట్ స్థానానికి శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకూ పోలింగ్ జరగనుంది. ఎండ తీవ్రత నేపథ్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద టెంట్లు, కేంద్రాల లోపల విద్యుత్, అలాగే ఓటర్లకు తాగునీరు, దివ్యాంగులకు ర్యాంపులు తదితర ఏర్పాట్లు చేశారు. ఈ ఎన్నికల్లో 26 మంది బరిలో నిలవగా వారిలో ఏకంగా 19 మంది ఇండిపెండెంట్లే కావడం విశేషం. 2019లో పుదుచ్చేరి లోక్‌సభ స్థానానికి జరిగిన ఎన్నికల్లో 81.19 శాతం పోలింగ్ నమోదైంది. అప్పట్లో పుదుచ్చేరిలో మొత్తం 9.73 లక్షల ఓటర్లకు గాను 8 లక్షల ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ప్రధానంగా పుదుచ్చేరి పార్లమెంట్‌లో 30వ అసెంబ్లీ నియోజకవర్గమైన యానాంలో ఏకంగా 86.45 శాతం పోలింగ్ నమోదైంది. దీంతో ఈ దఫా పోలింగ్ శాతం మరింత పెంచాలన్న సంకల్పంతో అధికారిక యంత్రాంగం గత రెండు రోజులుగా విస్తృత ప్రచారం నిర్వహించింది. ప్రధానంగా యువ ఓటర్లంతా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చేసేందుకు విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో చైతన్య ర్యాలీలు నిర్వహించారు. సుమారు నెల రోజుల పాటు ఈవీఎంలపై యువతకు అవగాహనా కార్యక్రమాలు జరిపారు. ప్రతి కాలేజీలోనూ ఓటుహక్కుపై అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ చర్యలన్నీ ఈసారి ఎన్నికల్లో పోలింగ్ శాతం పెరుగుదలకు దోహదం చేస్తాయని ఎన్నికల శాఖ ప్రతినిధి తిరుకోటి అర్జునరావు తెలిపారు. ఈ నేపథ్యంలో ఈసారి పుదుచ్చేరి పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ఉన్న 10,23,699 మంది ఓటర్లలో ఎంత శాతం ఓటింగ్ నమోదవుతుందనేది ఆసక్తికరంగా మారింది.



మహాత్మాగాంధీ ప్రభుత్వ బాలుర హైస్కూల్ వద్ద మోడల్ పోలింగ్ స్టేషన్

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



గేదెల్లంకలో రాజీనామా చేసిన వలంటీర్లు



ఠానేల్లంకలో రాజీనామా చేసిన వలంటీర్లు



పి.మల్లవరంలో రాజీనామా చేసిన వలంటీర్లు

ముమ్మిడివరం: మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలో పనిచేస్తున్న సుమారు 160 మంది వలంటీర్లు మూకుమ్మడిగా రాజీనామా చేశారు. మండలంలోని గేదెల్లంక, అన్నంపల్లి, కర్రివానిరేవు, అనాతవరం, లంకాఫ్ ఠానేల్లంక, క్రాప చింతలపూడిపాలెం, కొత్తలంక, ఠానేల్లంక, కొమానపల్లి, గాడిలంక, మర్లపాలెం, చినకొత్తలంక తదితర గ్రామ పంచాయతీల పరిధిలోని వలంటీర్లు రాజీనామా చేసి ఆయా గ్రామ పంచాయతీ కార్యదర్శులకు గురువారం తమ రాజీనామా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన పార్టీలు తమపై చేస్తున్న అసత్య ఆరోపణలకు నిరసనగా ఈ రాజీనామాలు చేసినట్టు తెలిపారు. ఇకపై జగనన్నకు అండగా నిలుస్తామని ప్రకటించారు.

27 మంది వలంటీర్ల రాజీనామా

కాట్రేనికోన: మండలంలోని కందికుప్ప పంచాయతీలో 24 మంది, బలుసుతిప్పలో ముగ్గురు వలంటీర్లు గురువారం రాజీనామా చేశారు. తమ రాజీనామా పత్రాలను ఆయా పంచాయతీ కార్యదర్శులకు అందచేశారు. ముమ్మిడివరంలో పొన్నాడ వెంకట సతీష్‌కుమార్, రాష్ట్రంలో జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు గ్రామ స్థాయిలో శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు.

పి.మల్లవరంలో 15 మంది..

తాళ్లరేవు: మండల పరిధిలోని పి.మల్లవరం పంచాయతీలో 15 మంది వలంటీర్లు మూకుమ్మడిగా తమ ఉద్యోగాలకు గురువారం రాజీనామా చేశారు. ఈ మేరకు తమ రాజీనామా పత్రాలను పంచాయితీ కార్యదర్శి రమణకు అందజేశారు. జగనన్నకు తోడుగా ఉండటానికి అదేవిధంగా ముమ్మిడివరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి పొన్నాడ సతీష్ కుమార్‌కు మద్దతుగా ఎన్నికల్లో అండగా ఉండటానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.